కంటి వెలుగుకు స్పందన అంతంతే

- ఒక్కో కేంద్రంలో 400 మందికి పరీక్షలకు ఏర్పాట్లు
- ఆరు కేంద్రాల్లో హాజరైంది.. 973 మంది మాత్రమే



బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌లోని కంటివెలుగు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సాయన్న, మర్రి రాజశేఖర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి..

కంటోన్మెంట్: రెండో విడత కంటివెలుగు కార్యక్రమం తొలి రోజు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. కంటోన్మెంట్ పరిధిలో మొత్తం ఆరు కేంద్రాల్లో కంటివెలుగు పరీక్షలు చేపట్టగా తొలి రోజు కేవలం 973 మంది మాత్రమే హాజరయ్యారు. ఒక్కో కేంద్రంలో 400 చొప్పున మొత్తం 2,400 మందికి పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో తగిన ప్రచారం కల్పించి ప్రజలను రప్పించడంలో బోర్డు యంత్రాంగం తగిన ప్రచారం కల్పించలేకపోయిందని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార పార్టీ నేతలు సైతం అంటీముట్టనట్లుగానే వ్యవహరించినట్లు సమాచారం. తొలి విడత సమయంలో మెజారిటీ బోర్డు సభ్యులు టీఆర్‌ఎస్‌లో కొనసాగడంతో పోటీ పడి మరీ ప్రజలను కంటివెలుగు పరీక్షలు తీసుకొచ్చారు. ఈ సారి వారంతా మాజీలు కావడంతో ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించారు. ఇక ఎమ్మెల్యే సాయన్న అనుచరులు కూడా పెద్దగా ప్రచారం జోలికి పోలేదు.

తిరుమలగిరిలో అత్యల్పం

కంటోన్మెంట్ పరిధిలోని మొత్తం ఆరు కేంద్రాల్లో తిరుమలగిరిలో కేవలం 57 మంది మాత్రమే కంటి పరీక్షలు చేయించుకున్నారు. బొల్లారంలో అత్యధికంగా 260, పికెట్‌లో 230, బాలంరాయిలో 200, రసూల్‌పురాలో 126, బోయిన్‌పల్లిలో 109 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. ఒక్కో కేంద్రంలో ఒక్కో కంటి వైద్యులతో పాటు ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు ఏఎన్‌ఎం, 4 ఆశా వర్కర్‌లు, మరో ఇద్దరు సిబ్బంది మొత్తం పది మంది చొప్పున విధులు నిర్వర్తిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజకుమారి తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిరంతరాయంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్‌ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత తదితర కారణాల వల్ల శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలోని రాధా సత్సంగ్, మారేడుపల్లి ఫీడర్ పరిధిలోని ఠాగూర్ హోమ్స్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మచ్చబొల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప నగర్, నెహ్రూనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 43, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 20, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

నేడు రుద్ర హోమం

సనత్‌నగర్: పుష్యమాసం బహుళ చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని శివాలయంలో రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ ఉంటాయన్నారు.

ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. గురువారం పాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తదితరులు ఫలితాలను విడుదల చేశారు. డిసెంబరు 1, 2, 3 తేదీలలో 47 సబ్జెక్టులకు 6656 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 1508 (22.66శాతం) మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎడ్యుకేషన్‌లో 148 మంది అర్హత సాధించగా టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో ఒక్కరు కూడా అర్హత సాధించలేదు. ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చని, ర్యాంక్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

మహంకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.24.60లక్షలు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి హుండీ ద్వారా ఆదాయం రూ.24,60,714 లక్షల లభించింది. గురువారం దేవాలయంలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో ఈవో మనోహర్‌రెడ్డి దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'అమరుల ఆశయాలు ఆవిరైపోయాయి'

లాలాపేట: తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పౌరసమాజం ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం గురువారం ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏండ్ల పోరాటం, అమరుల ఆశయాలు ఆవిరైపోయాయని, తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థి, నిరుద్యోగ యువత మనోభావాలను టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసిందన్నారు.

'ఉపాధ్యాయ పక్షపాతిగా ఉంటా'



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పీఆర్‌టీయు అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి.

లాలాపేట: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీఆర్‌టీయు టిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి మారెడుపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేశారు. గురువారం లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గడి స్కూల్)లో జరిగిన ప్రచారం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజక వర్గాల ఉపాధ్యాయ ఎన్నికల్లో తనను ఆదరించాలనీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనీ అభ్యర్థించారు.

10 కేంద్రాల్లో కంటి వెలుగు శిబిరాలు



బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కంటి వెలుగు ప్రారంభించి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. సనత్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 10 కేంద్రాలను ఏర్పాటుచేసి ×కంటి వెలుగు× సేవలను కొనసాగిస్తున్నారు. బేగంపేట డివిజన్‌లో పాటిగడ్డ మోడల్ మార్కెట్, ఓల్డ్ కస్టమ్ బస్తీ కమ్యూనిటీ హాళ్లలో జరిగిన కంటి పరీక్షలను స్థానిక కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి ప్రారంభించారు. సనత్‌నగర్ డివిజన్‌లో అల్లావుద్దీన్‌కోఠి, సుందర్‌నగర్ కమ్యూనిటీ హాళ్లలో జరిగిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ నివారణకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కంటి వైద్య పరీక్షల నుంచి శస్త్ర చికిత్స దాకా ప్రభుత్వం ఉచితంగా నిర్వహించి పేదల ఆర్థిక భారం లేకుండా చేస్తోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, రాజయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సుందర్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సీఎస్‌ను కలిసిన పాస్‌పోర్టు అధికారి



సీఎస్‌ను కలిసిన దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్: ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతలు స్వీకరించిన శాంతి కుమారిని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

ఆర్మీ నూతన యూనిఫాం బయటి వ్యక్తులకు విక్రయిస్తే చర్యలు

రసూల్‌పురా: గతేడాది భారత సైన్యం కోసం నూతనంగా ఆవిష్కరించిన యూనిఫాం కేవలం యూనిట్ రన్ క్యాంటిన్లో మాత్రమే విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్మీ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆవిష్కరించిన నూతన యూనిఫాం విషయంలో ఆర్మీకే పదేళ్ళ పాటు కాపిరైట్ హక్కు ఉందని మరో ఐదేళ్ళు పొడిగించే వీలుందని బయటి వ్యక్తులు ఎవరైనా విక్రయిస్తే తగిన చర్యలు ఉంటాయని తెలిపారు.

పొలిటికల్ సైన్స్ అధ్యాపకులకు వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో మూడు రోజుల అధ్యాపకుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి పొలిటికల్ సైన్స్ హెడ్, కన్వీనర్ ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఓయూ మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు, ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఓయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కావ్యకిషన్‌రెడ్డి

లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గం తార్నాక డివిజన్ హనుమాన్‌నగర్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి(ఏబీవీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్థానిక మహిళలందరూ ఉపయోగించుకోవాలని అన్నారు.

హిమాచల్‌ప్రదేశ్ కంటోన్మెంట్ విలీన ప్రక్రియలో తొలి అడుగు

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌ల విలీన ప్రక్రియలో ఓ ముందడుగు పడింది. దాదాపు పదేళ్లుగా ప్రతిపాదన దశలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో ఖాస్ యోల్ కంటోన్మెంట్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ గురువారం రక్షణ శాఖ ఉత్తర్వులు వెలురించింది. కంటోన్మెంట్ పరిధిలోని రోడ్లు, భవనాలు, తాగునీటి సరఫరా వ్యవస్థ, వాహనాలు ఇతరత్రా ఆస్తులతో పాటు ఉద్యోగులను సైతం రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీన ప్రక్రియకూడా చురుగ్గా సాగుతున్న సంగతి తెలిసిందే.

'కంటి వెలుగు'తో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో మేలు జరుగుతోందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. డివిజన్లోని బాబు జగ్జీవన్‌రామ్ భవనం, తుకారాం గేట్‌లోని బోయబస్తీ కమ్యూనిటీహాళ్లలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వృద్ధులకు, ఇతర కంటి సమస్యలున్న వారందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, డాక్టర్ సాయి శంకర్, మనోహర్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



సనత్‌నగర్: రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ఓ ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం..శ్యాంలాల్ బిల్డింగ్స్ వద్ద బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా టీఎస్13 యుసీ 7713 నెంబర్ గల ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతుడి వివరాలు లభ్యం కాలేదు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో ఉంటున్న సదరు వ్యక్తి యాచకుడి అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

బస్తీ వాసులకు ధైర్యం చెప్పిన కార్పొరేటర్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: మినిస్టర్ రోడ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపికలు సందర్శించి ఘటన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం పక్కన ఉన్న కాచిబోలి బస్తీలో ఆందోళన చెందుతున్న ప్రజల వద్దకు వెళ్లి కార్పొరేటర్ చీర సుచిత్ర వారికి ధైర్యం చెప్పారు. అందరూ ఇళ్లను వదలిపెట్టి దూరంగా సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని ఆమె సూచించారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ బృందాలు మంటలను అదుపులోకి తెచ్చేందుకు యత్నిస్తున్నారని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆమె బస్తీ ప్రజలకు సూచించారు. అవసరమైన తక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె హామి ఇచ్చారు.

లష్కర్‌లో 8 కంటి వెలుగు కేంద్రాలు ప్రారంభం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 8 కేంద్రాల్లో గురువారం కంటివెలుగు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మెట్టుగూడ డివిజన్ చింతబావి కమ్యూనిటీహాలు, సీతాఫల్‌మండి డివిజన్ కుట్టివెల్లోడి ఆసుపత్రి, బౌద్ధనగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాలులో కంటి వెలుగు శిబిరాలను శాసన సభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కంటి పరీక్షలు నిర్వహించడం కోసం ఎనమిది కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల కోసం వచ్చే వారి సంఖ్యకు అనుగుణంగా మరిన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ టీ.దశరథ్, మెడికల్ ఆఫీసర్లు సక్కుబాయి, డాక్టర్ రవీందర్‌గౌడ్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనాథ్, జీహెచ్‌ఎంసీ కార్పోరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ, టీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, కిరణ్, రామేశ్వర్, కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి శిబిరాలను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



కంటి శిభిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను గురువారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. లాలాపేటలోని ప్రొ.జయశంకర్ ఇండోర్ స్టేడియంలో, తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో శిభిరాలను ప్రారంభించి స్వయంగా ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ సౌశీల్యారాణి పాల్గొన్నారు.

రైల్ నిలయం ఎదుట జర్నలిస్టుల ధర్నా



రైల్ నిలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

అడ్డగుట్ట: జర్నలిస్టుల రైల్వే పాస్‌లను వెంటనే పునరుద్ధరించాలని జర్నలిస్ట్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట హైద్రాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, తెలంగాణ బ్రాడ్‌క్యాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ కరోనా ముందు వరకు కొనసాగిన రాయితీని ఆ తరువాత ఎత్తివేయడంపై మండిపడ్డారు. జర్నలిస్ట్ రైల్వే పాస్‌లను వెంటనే పునరుద్ధరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం, ఇదే విషయమై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం సమర్పించారు. హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్ కుమార్, కార్యదర్శి జగదీష్, టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య పాల్గొన్నారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



ప్రొ.లింబాద్రిని సన్మానిస్తున్న ఎంబీఏ కాలేజీ ప్రొఫెసర్లు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఎంబీఏ కాలేజీలో అడ్వాన్స్‌డ్ బిజినెస్ డైనమిక్స్ ఇన్ గ్లోబల్ మార్కెట్ అనే అంశం పై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. గురువారం కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొ.జహంగీర్, ప్రొ.నాగేశ్వర్‌రావు, ప్రొ.స్మిత సొంబ్రాణి, ప్రొ.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లభ్యం కాని లోకో పైలెట్ వాసవీ ప్రభ ఆచూకీ



అదృశ్యమైన వాసవీ ప్రభ

సనత్‌నగర్: రైలు లోకో పైలెట్ వాసవి ప్రభ (26) అదృశ్యం కేసు మిస్టరీ వీడలేదు. గత ఏడాది నవంబర్ 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఆమె జాడ ఇంకా తెలియలేదు. ఆమె ఆచూకీ కోసం అటు కుటుంబసభ్యులు, ఇటు పోలీసులు జల్లెడ పట్టి వెతుకుతున్నా ఫలితం కనిపించలేదు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, మంగళంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రావు ఒక్కగానొక్క కుమార్తె అయిన వాసవి ప్రభ (26) రైల్వేలో లోకో పైలెట్‌గా పనిచేస్తోంది. విజయవాడ నుంచి గత ఏడాది జులైలో సికింద్రాబాద్‌కు బదిలీపై వచ్చి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమతానగర్‌లో నివాసం ఉంటుంది. గత సంవత్సరం నవంబర్ 30వ తేదీన తండ్రి భాస్కర్‌రావు తన కుమార్తె వాసవీ ప్రభకు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె నివాసం ఉండే ఇంటి యజమానికి తండ్రి ఫోన్ చేయగా అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వెళ్తున్నానని చెప్పి తాళం వేసి వెళ్ళిందని సమాధానమిచ్చాడు. అయితే కుమార్తె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పాటు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఇంటి యజమాని సహాయంతో వాసవీ ప్రభ ఉండే గది తాళాలు తీసి లోపలికి వెళ్ళి పరిశీలించారు. ఆమె ఫోన్‌తో పాటు ఐడీ కార్డు, డెబిట్ కార్డు, ఇతర గాడ్జెట్ ఇంట్లోని కనిపించిన విషయం విదితమే. తండ్రి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఆమెకు సంబంధించిన ఫోన్‌తో పాటు డెబిట్‌కార్డు, ఇతర గాడ్జెట్స్ కూడా ఇంట్లోనే ఉండడంతో ఆమె ఆచూకీ కనుగొనడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు సనత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ 94906 17132, ఎస్‌ఐ 89195 58998 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ కోరారు.

ప్రారంభమైన కంటి పరీక్షలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో కంటి వెలుగు కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైయింది. న్యూబోయిగూడ, హమాల్‌బస్తీ, విక్టోరియాగంజ్ ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాల ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేయడం తోపాటు శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారిని వైద్యులు గుర్తించారు. హమాల్‌బస్తీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జీ పవన్‌కుమార్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు.

- న్యూబోయిగూడ బాపూజీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కార్పొరేటర్ కె. హేమలత ప్రారంభించారు. విక్టోరియాగంజ్‌లో కంటి శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. వైద్య సిబ్బంది, జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



హమాల్‌బస్తీలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్